క్లుప్తంగా

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



నల్లబెల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ రాజేశ్ కోరారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. 155, 156వ నంబర్ పోలింగ్ కేంద్రాల్లో 1809 మంది ఓటు వేయనున్నట్లు తెలిపారు. పట్టభద్రులు ప్రలోభాలకు లొంగకుండా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ నర్సింహమూర్తి పర్యవేక్షించారు. ప్రశాంతమైన వాతవరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు, ప్రజలు సహకరించాలని ఎస్సై రామారావు కోరారు.

కుటుంబ కలహాలతో మహిళ మృతి

కాటారం(మహదేవపూర్): కుటుంబ కలహాలతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మహదేవపూర్ మండలం బొమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కన్నెపల్లికి చెందిన తేజస్విని(32)కి బొమ్మాపూర్‌కు చెందిన మడక తిరుపతికి 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్ని సంవత్సరాలుగా తేజస్విని తల్లిదండ్రులు వరకట్నంగా ఇచ్చిన భూమి విక్రయించాలని కుటుంబంలో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని భూమి విక్రయానికి తేజస్విని ఒప్పుకోవడం లేదు. ఈ క్రమంలో ఈ నెల 25న మరోమారు కుటుంబంలో గొడవలు జరిగి తేజస్వినిపై కుటుంబ సభ్యులు చేయిచేసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన తేజస్విని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన పలువురు వరంగల్ ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి బాపురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

ఖానాపురం : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి తెలిపారు. మండలంలోని అశోక్‌నగర్, అయోధ్యనగర్‌ల్లో ఏర్పాటు చేసిన క్రీడల శిబిరాలను ఆదివారం ఆమె సందర్శించి మాట్లాడారు. అశోక్‌నగర్‌లో అథ్లెటిక్స్, అయోధ్యనగర్‌లో వాలీబాల్ క్రీడల శిబిరాలతో యువతకు మెరుగైన శిక్షణ లభిస్తుందని చెప్పారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. పట్టుదలతో క్రీడల్లో రాణించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడలకు సమయం కేటాయించాలని చెప్పారు. యువత శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి బాటలు వేస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడల్లో శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కబడ్డీ కోచ్ యాట రవికుమార్, ఉరుసుల శేఖర్, వజ్జ రాజేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



మంగపేట: పోలింగ్ ఏర్పాట్లు చేసుకుంటున్న పోలింగ్ సిబ్బంది



వాజేడు: పోలింగ్ ఏర్పాట్లు చేసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

వాజేడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఆదివారం సర్వం సిద్ధం చేశారు. మండలంలో 550 పట్టభద్రుల ఓట్లు ఉండగా అందుకు అనుగుణంగా ఏర్పాట్లను చేశారు. వాజేడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద టెంట్ వేసి నీడను కల్పించారు. తాగు నీరు ఇతర సౌకర్యాలను కల్పించారు. పోలింగ్‌కు సంబంధించి సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సిబ్బందితో పర్యవేక్షణ చేశారు.

కన్నాయిగూడెం: ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించిన పోలింగ్ బాక్స్‌లు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్నాయి. ఎన్నికకు సంబంధించిన ఏర్పాటును అధికారులు సిద్ధం చేశారు.

మంగపేట: మండలంలోని మంగపేట, రాజుపేట పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో పోలింగ్ అధికారులు ఆదివారం చేరుకున్నారు. మంగపేట పోలింగ్ కేంద్రంలో 906, రాజుపేట పోలింగ్ కేంద్రంలో 326 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ ఎన్నిలక అధికారి బైరి వీరస్వామి సందర్శించారు. ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.



కన్నాయిగూడెం: పోలింగ్ కేంద్రానికి చేరిన సిబ్బంది

చిట్యాల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను సిద్ధం చేసినట్లు తహసీల్దార్ ఖాజా మోహియోద్దీన్ తెలిపారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన 218, 219 పోలింగ్ బూత్‌లను ఆయన సందర్శించారు. మండలంలో 1558 మంది పట్టభద్రులు ఉన్నారని తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు ముగుస్తుందని తెలిపారు.



వాజేడు: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్

హైలెవల్ వంతెన నిర్మించాలి



వంతెనను పరిశీలిస్తున్న నాయకులు

ములుగు రూరల్: మండలంలోని సర్వాపూర్–జగ్గన్నగూడెం మధ్య ఉన్న బొగ్గుల వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని సీపీఎం నాయకుడు గుండబోయిన రవిగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి బొగ్గల వాగు వద్ద కొట్టుకుపోయిన లోలెవల్ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల కారణంగా బొగ్గల వాగు లోలెవల్ వంతెన కొట్టుకుపోవడంతో ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతో పాటు ఓటాయి, రాంపూర్ గ్రామాల ప్రజలు ఈ దారి వెంట ములుగు, గోవిందరావుపేట మండలాలకు వస్తుంటారని అన్నారు. వర్షాకాలంలో వాగు అవతలి గ్రామాల ప్రజలు వాగు దాటలేక వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఐటీడీఏ అధికారులు, మంత్రి సీతక్క స్పందించి హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో గుండమీది వెంకటేశ్వర్లు, లక్ష్మన్, రవి, జాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సామగ్రిని చూపుతున్న అధికారులు

మల్హర్: మండలంలో 16 లీటర్ల గుడుంబా, సామగ్రిని ఎక్సైజ్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కాటారం ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడుంబా రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు మండలంలోని పెద్దతూండ్ల, అడ్వాలపల్లి గ్రామాల్లో తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ మేరకు ద్విచక్ర వాహనంపై రవాణా చేస్తున్న 16 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పెద్దతూండ్లలోని ఓ కిరాణా షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 56 ఈస్ట్ ప్యాకెట్లు, 17(50 కేజీల) చెక్కర బ్యాగులను స్వాధీనం చేసుకొని అజ్మీరా సమ్మయ్య, అట్టెం రాజేందర్, రావెల్లి సంతోష్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై కిష్టయ్య, సిబ్బంది రామ్‌చందర్, వెంకట్‌రాజు, కోటేశ్వర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాజేడు: తనిఖీ చేస్తున్న వాజేడు ఎస్సై



వాజేడు: కృష్ణాపురం వద్ద..

వాజేడు: మండలంలో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరంగా చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ తనిఖీలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మండల పరిధిలోని కృష్ణాపురం వద్ద జాతీయ రహదారిపై పేరూరు ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో మండపాక గ్రామం వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేశారు. ప్రయాణికులు వివరాలను అడిగి తెలుసు కోవడంతో పాటు కొత్త వ్యక్తులు, అపరిచితులు, అనుమానితులు తారస పడితే సమాచారం ఇవ్వాలని వాహనదారులను ఆదేశించారు.

ఘనంగా నగరసంకీర్తన



నగర సంకీర్తనలో భక్తులు

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయిలో హనుమాన్ నగర సంకీర్తనను ఘనంగా నిర్వహించారు. ఆదివారం గురుస్వామి మూల కుమార్ ఆధ్వర్యంలో సీతారామాంజనేయ స్వామి ఆలయం నుంచి హనుమాన్ శోభయాత్ర, నగర సంకీర్తన వేడుకలు ప్రారంభించారు. సీతారామాంజనేయులను సుమారు 200 మంది మాలాధారణ స్వాములు భజనలు చేస్తూ, కోలాటాలతో ఊరేగించారు. శోభయాత్రలో స్వామి వారికి మహిళలు బిందెలతో నీళ్ల ఆరగించి , మంగళహారతులు పట్టారు. శోభయాత్రలో స్వామి వారికి సుమారు రూ.30 వేల వరకు విరాళాలు అందించారు. సహకరించిన దాతలకు గురుస్వాములు కృతజ్ఞతలు తెలిపారు.

పాములను రక్షించి అడవిలో వదలాలి



అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యులు

ఏటూరునాగారం: పాములను చంపకుండా రక్షించి అడవిలో వదిలేయాలని స్నేక్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఫారెస్టు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆదివారం డివిజన్ కార్యాలయంలో కాంప్లెక్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఫ్రెండ్స్ స్నేక్ సొసైటీ హైదరాబాద్ వారు అటవీ సిబ్బందికి పాములను ఏలా పట్టుకోవాలో అడవిలో ఏలా వదిలి వేయాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఏటూరునాగారం, వెంకటపూర్ డివిజన్ నుంచి ఎఫ్ఆర్ఓలు శిరీష, బాలరాజు, నరేందర్, కృష్ణవేణి, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటిశుద్ధి కేంద్రం

- పీహెచ్‌సీలో ఇబ్బందులు పడుతున్న రోగులు
- రూ.6లక్షలతో నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా వాటర్ ట్యాంకు



ఏర్పాటు చేసిన నీటిశుద్ధి యంత్రం

కన్నాయిగూడెం: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రం నిరుపయోగంగా మారింది. వైద్యుల సరైన నిర్వహణ లేకపోవడంతో చిన్న సమస్యకే మూలకు పడుతుంది. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.

పీఎన్‌బీ ఆర్థిక సహకారంతో..

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) సహకారంతో ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఆలోచనలో రూ.6లక్షలతో నీటిశుద్ధి యంత్రంతో పాటు మూడు బెడ్స్, వీల్‌చైర్, స్ట్రక్చర్‌ను 2022 సంవత్సరంలో బహూకరించారు. ప్రారంభించిన కొన్ని నెలలు ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందించారు. అనంతరం యంత్రాన్ని జాగ్రత్తగా చూడాల్సిన సిబ్బంది గాలికి వదిలేయడంతో చిన్న సమస్యకే మూలకు పడింది. చిన్న సాంకేతిక లోపం రావడంతో అధికారులు మరమ్మతు చేయకుండా పక్కన పెట్టారు. దీంతో రెండు సంవత్సరాలుగా రోగులను మంచినీటిని అందించడం లేదు. ఇంటి నుంచి నీటిని తీసుకొస్తే తప్ప.. అక్కడ నీరు దొరికే పరిస్థితి లేకుండా పోయింది.

వినియోగంలోకి తీసుకురావాలి



ఆరోగ్య కేంద్రంలో ఉన్న తాగు నీరు శుద్ధి కేంద్రాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి. నీరు లేక లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో మరమ్మతుకు గురైంది. వెంటనే నీటి శుద్ధి యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

\- దుర్గం శివ, యువకుడు

రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న సదానందం

నర్సంపేట : ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి అన్ని రకాల పంటల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు ఉచితంగా అందించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి అడ్డూరి రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో సదానందం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2024లోనే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రెండింతల ఆదాయం తెచ్చి పెడతామని నమ్మించి రైతులను వంచించిందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నాశనం చేసేలా సబ్సిడీలు రద్దు చేసిందని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డాక రైతుబంధు పథకాన్ని సర్వరోగ నివారిణిలా చూపించి రైతులను మోసం చేశారన్నారు. బ్యాంకుల్లో అప్పు తీసుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా పథకాన్ని వర్తింపజేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో జూన్ 1 నుంచి 5 వరకు నిర్వహించే చిరుతల రామాయణం నాటిక ప్రదర్శన ఆహ్వాన పత్రికన ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యనారాయ ణరావు ఆదివారం ఆవిష్కరించారు. రామాయణం నాటిక ప్రదర్శనకు వచ్చి వీక్షించాలని వెంకటేశ్వర్లపల్లి చిరుతల రామాయణ భక్త మండలి సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. భక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ చిరుతల రామాయణం నాటిక ప్రదర్శనకు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు వచ్చి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. 1న శనివారం శ్రీ సీతారాముల కల్యాణం, 2న సీతారాముల అరణ్యవాసం, 3న వాలివధ, 4న లంకా దహనం, 5న రావణవధ ఉంటుందని బృందం సభ్యులు తెలిపారు. వెంకటేశ్వర్లపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ నాయకులు, భక్త మండలి సభ్యులు ఉన్నారు.

పాఠశాలకు వాటర్ ప్యూరి ఫయర్ అందజేత

కొత్తగూడ: పదో తరగతి వరకు విద్యా బుద్ధులు నేర్పిన పొగుళ్లపల్లి ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమవంతు సాయంగా వాటర్ ప్యూరి ఫయర్ ఆదివారం అందజేశారు. 2022–23 బ్యాచ్ పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అంతా కలసి అందించడం అభినందనీయమని ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు నాగలక్ష్మి, హెచ్ఎం విష్ణువర్ధన్‌రావు అన్నారు.

డ్రైయినేజీలు లేక అస్తవ్యస్తం





రోడ్డు వెంట పారుతున్న మురుగు నీరు

- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో కొంత కాలం నుంచి డ్రైయినేజీలు సరిగా లేక పోవడంతో మురుగు అంతా రోడ్డుపైకి అస్తవ్యస్తంగా ఉంటుంది. గ్రామంలో సరైనా సైడ్ కాల్వలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోని వాడిన నీరు రోడ్డు వెంటనే ప్రవయిస్తుడంతో రోడ్లన్నీ మురుగు కుంటలాగా మారిపోతున్నాయి. గతంలో ప్రజాప్రతినిధులు కొంత మేరకు పని చేసిన నామామాత్రంగానే కనిపించింది. వర్షపు నీరు కూడా రోడ్డు వెంట నిలుస్తుంది. రానున్నది వర్ష కాలం కావున వ్యాధులు సోకే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. జిల్లా అధికారులు, ఎమ్మెల్యే పట్టించుకుని గ్రామానికి సైడ్ కాల్వలు నిర్మించాలని కోరుతున్నారు.



రోడ్డు పక్కన నిలిచిన వర్షపు నీరు

సైడ్ కాల్వలు నిర్మించాలి



గ్రామంలో సైడ్ కాలవలు లేక ఇబ్బంది పడుతున్నాం. ఇళ్లలో వాడిన నీరు రోడ్డు వెంటే బయటకు వస్తుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ఎమ్మెల్యే పట్టించుకుని సైడ్ కాలవ్ల నిర్మించాలి.

\- కొమురయ్య, తిర్మలాపూర్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన చినగారి రాజు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడితో కలిసి స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదవారం రూ.40 వేల సాయం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాజు స్నేహితులు వీరగోని దేవేందర్, పేర్ల శ్రవణ్, ఆకుల రుద్రప్రసాద్, తాటికొండ శివకుమార్, కందుకూరి కిరణ్, కంబాల సాంబరాజు, కోట రాజు, మేకల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.